"సైలెన్స్" అంటూ మేజస్ట్రేటుగారు చెక్క సుత్తితో బల్లపై కొట్టారు. కోర్టు అంతా నిశ్శబ్దంతో నిండిపోయింది.

చీర నిండుగా కప్పుకొని తల వంచుకొని బోనులో నిల్చుంది లక్ష్మి.

"నీ పేరేమిటి?"

"లక్ష్మి".

"చదువుకొన్నదానిలా వున్నావ్?" అర్థం లేని ప్రశ్న.

"పుస్తకాలు మాత్రమే చదివాను."


"మరింకేవిటి చదువుతారు?" కళ్ళజోడు సర్దుకొని ప్రశ్నించారు.

"మనుషుల మనసులు"

"సరిసరి—చేసిన నేరం ఒప్పుకొంటున్నావా?"

బేలగా చూసింది లక్ష్మి.

కసాయివాని కత్తికింద నిలబడిన మేకపిల్ల చూసిన చూపులా కన్పించింది ఆ చూపు మేజస్ట్రేటు గారికి. క్షణం సేపు జాలి కలిగింది. అంతలోనే కర్తవ్యనిర్వహణ గుర్తుకొచ్చి సర్దుకొని కూర్చున్నారు. కోర్టులో అంతా ఆమెవైపే చూస్తున్నారు.




# ఆత్మరక్షణ : జొలాజమీమా

"లేదు నేను నేరం చెయ్యలేదు" నొక్కి చెప్పింది. జరిగిందంతా చెప్పింది.

"సాక్ష్యాలు ఏవైనా ఉన్నాయా?" అని అడిగారు అంతా విన్న మేజస్ట్రేటుగారు. కోర్టంతా కలయజూసింది. ఎవరూ ఆమె వైపు చూడలేదు అంతా మేజస్ట్రేటుగారి వైపే చూస్తున్నారు.

నిశ్శబ్దంగా తల వంచుకొంది.

"వ్యభిచారం చేయటమే కాకుండా ఆ సమయంలో నిన్ను నిర్బంధంలోకి తీసుకొనడానికి వచ్చిన పోలీసు కానిస్టేబుల్ని కొట్టినందుకుగాను వ్యభిచారనేరం, క్రిమినల్ నేరంతో కలిపి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తున్నాను."

రెండు కన్నీటి చుక్కలు బోను కమ్మిపైపడి క్రిందకు జారాయి. వాటిని తొక్కుకుంటూ వచ్చిన పోలీసులు లక్ష్మిని తీసుకు వెళ్ళారు.

ఆమె మనసు మూగగా రోదించింది.

పోలీసువేను జైలువైపు కదిలింది.

*

లక్ష్మి వీరాస్వామి పెద్ద కూతురు. వీరాస్వామి తాసిల్దారుగారి ఆఫీసులో పెద్ద జవాను. అందరికీ ఆప్తుడు కానీ ఇంట్లో అందరికీ శత్రువు. తను సంపాదించిందంతా తాగి తందనాలాడి మిగిలింది ఇంట్లో యిస్తాడు. దక్కిందే భాగ్యమని వీరాస్వామి భార్య సంసారాన్ని భారంగా నెట్టుకొస్తుంది— వీరాస్వామి కని పడేసిన ఎనిమిదిమంది పిల్లల్తోను! ఈ జీవితం మీద విరక్తి కలిగినప్పుడల్లా కడుపు నిండా తాగి యింటికొచ్చి పిల్లల్ని చిదకబాదుతాడు. తల్లి అప్పుడప్పుడు వీరస్వామి మీద అలిగి మంచ మెక్కినప్పుడు, నిజంగా మంచ మెక్కినప్పుడూ యింటి బాధ్యతనంతా మీద వేసుకుని చక్కగా నిర్వహిస్తుంది లక్ష్మి. పెళ్ళీడు కొచ్చినా లక్ష్మి విషయమే పట్టించుకోని వీరాస్వామిని ఇంటిలో అందరూ అసహ్యించుకుంటుంటే, ఇరుగు పొరుగుల వారి సాధింపులతో వీరాస్వామి భార్య సగం కృంగిపోయింది. తెలివైనది కావడంతో పదవ తరగతి పాసవ గలిగింది లక్ష్మి.

రామారావు పొడుగ్గా గిరిజాల జుట్టుతో అందంగా ఉండేవాడు. కొంతమంది అతన్ని సినిమా యాక్టరుతో పోల్చుకునేవారు. ఏమైతేనేం ఆ వూరు వచ్చి నెల మాత్రమే అయినా కన్నెపడుచుల హృదయాలను మాత్రం దోచుకున్నాడు. ఏ ఉద్యోగం చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. టంచనుగా ఏడు గంటలకు బైటకు వెళ్ళిపోతాడు. మళ్ళీ సాయంత్రం వస్తాడు. ఒక రోజు లక్ష్మి కాలువ నుండి నీళ్ళు తెస్తోంటే చూసి పలకరింపుగా నవ్వాడు. ఎవరో పోకిరి వాడనుకుని ఊరుకుంది. రెండవ రోజు

అప్రయత్నంగా చూసి 'బావున్నాడు' అనుకుంది. అదే నవ్వు. మూడవ రోజు అలవాటుగా చూసి నవ్వకుండా ఉండలేకపోయింది. తన అందాన్నంతా అతను తనివిదీరా పరీక్షిస్తూ నవ్వుతుంటే కళ్ళు తిప్పుకోలేకపోయింది. అతను చేతిలో ఏదో చూపిస్తున్నాడు. దగ్గరగా వచ్చిన లక్ష్మికి కాళ్ళ దగ్గరకొచ్చి ఒక కాగితం ఉండ వచ్చి పడింది. రోడ్డు మీద ఎవరైనా చూస్తారేమో అనుకుని కాస్త తటపటాయించి ఆ కాగితం ఉండను తీసుకుని వెళ్ళిపోయింది. తన గదిలోకి పోయి కాగితం విప్పి చదువుకుంది.

"నీ కిష్టమయితే మా వూరు వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుని హాయిగా జీవిద్దాం" అని రాశాడు. ఆ క్షణంలో, ధైర్యంగా ముందుకు వచ్చి తన తల్లి దండ్రులను ఒప్పించలేని పిరికిపందగా, కనిపించ లేదు రామారావు. సినిమాల్లో చూపినట్టు త్యాగం చేయగలడేమో అనిపించింది. నవలల్లో చదివిన హీరోలా తనని ఎత్తుకు పోతున్నట్లు అనిపించింది.

ఆ క్షణంలో మరేమీ ఆలోచించలేకపోయింది. ఏదో పెన్నిధి దొరికినట్లనిపించింది. మరేమీ ఆలోచించకుండా ఆ రాత్రే రామారావుతో విజయవాడ వచ్చేసింది. తండ్రి అసమర్థత తెలిసి, గుండెల మీద కుంపటిలా భావించి బాధ పడుతున్న తల్లిని చూసి లక్ష్మి మంచిపనే చేసింది అనుకొన్నారు కొందరు. కొందరు లేచిపోయింది అని విచిత్రంగా చెప్పుకున్నారు.

రామారావు మొదట్లో చాలా మంచిగా ప్రవర్తించేవాడు. ఆమెకు కావలసినవన్నీ సమకూర్చేవాడు. కొన్ని రోజులు సంతోషంగా హాయిగా గడిచిపోయింది కాలం. లక్ష్మికి అప్పుడప్పుడూ పెళ్ళి చేసుకుంటే బావుంటుందేమో అనిపించేది కాని ఆమె ఎప్పుడైనా అలా సూచిస్తే 'మనకేం హాయిగా వుంటున్నాము ఎందుకు లెద్దూ ఖర్చు దండగ' అనేవాడు. కానీ క్రమంగా తన తండ్రికి ఉన్న సద్గుణాలలో ఏ ఒక్కటీ తక్కువ కాదు అని తెల్సుకొనేటప్పటికి ఒక సంవత్సరం గడిచిపోయింది. క్రమేపీ తాగి రావడం, లక్ష్మిని కొట్టడం లాంటి పనులు చేసేవాడు. ఒక్కోరోజు దెబ్బలు తిని ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోతే ఆమెను క్రూరంగా హింసించి తన కోరిక తీర్చుకునేవాడు. దుర్భరమైన జీవితం నెట్టుకొస్తున్న పరిస్థితులలో ఒక రోజు రామారావు తాగి రాలేదు! కొత్త చీర, మల్లెపూలు తెచ్చాడు!!

> ప్రారంభ దశలో ఆనెలుగల పాదాలను శుభ్రంగా కడిగి, తుడిచి, రోజూ మూడు పూటలు టించర్ ఐయోడిన్ పూస్తే, ఆనెలు వారంలోపల మాయమవుతాయి.
>
> వంట చేసేటప్పుడు చేయో, కాలో, వ్రేళ్ళో కాలాయనుకోండి. వెంటనే కాలిన భాగాన్ని, వెడల్పు మూతిగల పాత్రలో చల్లని పాలు పోసి అందులో మునిగేటట్లు ఉంచాలి. బాధ (మండుట) తగ్గుతుంది; బొబ్బలు ఎక్కవు.
>
> —తలుపూరు వసంత

"లక్ష్మి తొందరగా తయారవ్వు రిక్షా తీసుకొస్తాను" అంటూ వెళ్ళిపోయాడు!

చాలా రోజుల తరువాత వసంతం విరిసింది, నవ్వుల జల్లు కురిసింది. లక్ష్మి మనసు హాయిగా పాడుకొంది. ఒక ప్రక్క సిగ్గుతో ఉక్కిరిబిక్కిరి అయింది. రిక్షాలో రామారావుతో కలిసి బయలుదేరింది. రిక్షా ఒక యిరుకు సందులోకి వచ్చి ఆగి పోయింది. ఆశ్చర్యంగా చూస్తున్న లక్ష్మిని చేయి పట్టుకొని తీసుకెళ్ళాడు రామారావు. ఒక గుమ్మం దగ్గిర ఆగి తలుపు తట్టాడు. కిళ్ళీ బుగ్గన పెట్టుకుని నవ్వుతూ ఉన్న ఒక నడి వయసు స్త్రీ తలుపు తీసింది. ఆమెను చూసి మరింత ఆశ్చర్యపోయింది ఎవరో తెలియక.

"లక్ష్మి ఇది మనవాళ్ళ యిల్లు నువు ఇక్కడే వుండు క్షణంలో వచ్చేస్తాను" అంటూ బయటికి నడిచాడు.

ఆమె నిలువెల్లా పరీక్షగా చూసింది. క్షణంసేపు సిగ్గుపడింది లక్ష్మి. "లోనికిరా" అంటూ ఆప్యాయంగా చేయి పట్టుకొని తీసుకెళ్ళింది.

సాయంత్రం అయ్యేకొద్దీ ఎవరో అమ్మాయిలు వస్తున్నారు. కొందరు లక్ష్మిని ఈర్ష్యగా చూస్తూ మూతులు తిప్పుకుంటున్నారు. కొందరు జాలిగా చూస్తూ కళ్ళతోనే పలకరిస్తున్నారు.

కాస్సేపటికి మగవాళ్ళు ఎవరెవరో వస్తున్నారు. లక్ష్మికి మాత్రం ఎక్కడికి వచ్చిందో అర్థమయింది. గాభరాగా ఆమె కోసం చూసింది. ఆమె నవ్వుకుంటూ దగ్గరగా వచ్చింది.

"చూడమ్మా ఆయనెప్పుడొస్తారు?" అమాయకంగా అడిగింది.

"ఎవరూ రామారావా....పిచ్చితల్లీ నిన్ను నాకు ఏడువందల రూపాయలకు అమ్మేసాడు" అంది.

ప్రపంచం బ్రద్దలయిపోయింది .... తల గిర్రున తిరుగ సాగింది.

అంతలో తలుపులు కూడా బ్రద్దలవ్వసాగాయి. అందరూ ఆ మూల నుండి ఈ మూలకు హడావుడిగా పరుగెత్తుతున్నారు.

వీధి గుమ్మం తలుపు తెరిచింది ఆమె.

ఒక హెడ్ కానిస్టేబులు కొంతమంది పోలీసులను తీసుకుని లోనికి ప్రవేశించాడు. వెనుక నుండి కూడా పోలీసులు పారిపోతున్న వారిని పట్టుకుని తీసుకొచ్చారు.

"చాలా సరుకుందే యివాళ" పళ్ళికిలించాడు హెడ్‌కానిస్టేబులు.

"ఒరే పాపారావూ నువ్వూ ఏడుకొండలు వీళ్ళందర్నీ తీసుకెళ్ళి కేసులు రాయించండి. ఇప్పుడే వత్తా" అంటూ వెనుదిరగ బోయిన హెడ్ లక్ష్మిని చూసి బ్రేకు వేసినట్టు ఆగిపోయాడు.

"నువ్వేటి అనుకోకు కనకం ... కొత్త ఎస్పీ వొచ్చాడు కేసులు కోసం పీడించేత్తున్నాడనుకో" అంటూ లక్ష్మి దగ్గరకు నడిచాడు.

"బాబ్బాబు నీకు పుణ్యం ఉంటుంది ఆ అమ్మాయి జోలి కెళ్ళొద్దు ఇవాళే వచ్చింది ఏమీ తెలియదు" హెడ్ వుద్దేశం కనిపెట్టి బ్రతిమిలాడింది కనకం.

"నువ్వేండెసే" అంటూ చిరాకుపడి లక్ష్మి చేయ్యి పట్టుకులాగాడు. హెడ్డు చెంప ఛెళ్ళుమంది. కనకం గుండె గుభెల్లుమంది.

హెడ్డు లక్ష్మి జుట్టు పట్టుకున్నాడు.

అంతే పెద్ద పులిలా మీదపడి రక్కి, కొరికింది.

ఫలితం కేసు....

ప్రభుత్వం, న్యాయం, చట్టం అన్నీ లక్ష్మిని దోషిగా నిలబెట్టాయి.

*

ఆ జైల్లో లక్ష్మి కథ తెలిసిన వారందరిలో శ్రీలత అనే ఆవిడ లక్ష్మిని ఎంతో ఆదరాభిమానాలతో చూస్తోంది. ఆమె ఆ జైల్లో జైలరుగా పని చేస్తోంది. లక్ష్మి శిక్షాకాలం పూర్తయేలోగా ఆమెకు ఒక ఆధరువు చూపించి మనిషిగా నిలబెట్టాలి అనే ఉద్దేశం వుంది ఆమెకు. ఆమె అనుకున్న రోజు రానే వచ్చింది. ఖాళీ సమయంలో లక్ష్మి నేర్చుకున్న అల్లికలు యిక్కడ పని చేశాయి. అధునాతనంగా అల్లబడ్డ లక్ష్మి చేతిసంచులు మార్కెట్‌లో

బాగా సొమ్ము చేసుకుంటున్నాయి. తదుపరి అలాంటి సంచులు కావాలని జైలుకు ఆర్డర్సు కూడా బాగా వస్తున్నాయి. శ్రీలత వచ్చేటప్పటికి దీక్షగా సంచులు అల్లుతోంది లక్ష్మి. సంచులు కొనే వారి అభిరుచులన్నీ మేళవించి అల్లుతోంది.

"లక్ష్మీ! నిన్నింత దగా చేసిన ఈ మనుషుల పై నీకెందుకంత అభిమానం?"

"సంఘంలో పుట్టి మనుషుల మధ్య పెరిగాను గనుక" చిన్నగా నవ్వింది.

"కానీ ఆ సంఘం నీడలో నిలువలేకపోయావు నో....నో....నిన్ను ఆ సంఘమే నిలువనిచ్చింది కాదు."

"మీరూ సంఘమేగా. అందుకే మీలాంటి వారి చల్లని నీడలో హాయిగా భద్రంగా ఉంటున్నాను. ఇలా కూర్చోండి" అంటూ ప్రక్కనున్న స్టూలు లాగి కూర్చోమంది లక్ష్మి.

"అదిసరే. నేను వచ్చిన పనేమిటంటే నువు తయారుచేసిన సంచులు మార్కెట్‌లో బాగా డబ్బు చేసుకుంటున్నాయి. అందుకు స్త్రీ సంక్షేమశాఖ వారు ఏర్పాటు చేసిన విక్రయశాలలో నిన్ను నియమించా లని మేము సిఫారసు చేశాము. దానికి ఒక ఆఫీసరుగారు ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు నీవు వారిని సూపర్నెంటు గారి ఆఫీసులో కల్సుకో. వస్తాను మరి పనుంది" అంటూ వెళ్లిపోయింది శ్రీలత.

సాయంత్రం ఐదు గంటలకు సూపర్నెంటుగారి ఆఫీసుకు వెళ్లింది లక్ష్మి.

సూపర్నెంటుగారు లక్ష్మిని తీసుకొని ఆఫీసరు గారి ప్రత్యేక విడిదికి తీసుకొని వచ్చారు. లక్ష్మిని పరిచయంచేసి వెళ్లిపోయారు.

"కూర్చో" నవ్వుతూ కుర్చీ చూపించారు ఆఫీసరుగారు – ఆమె అందాన్ని తనివితీరా పరీక్షిస్తూ.

"నీ అల్లికలు, పనితనం చూసి నిన్ను విక్రయ శాలకు పంపుదామని నిర్ణయించింది ప్రభుత్వం. దానికి నిన్ను రికమెండ్ చేశాననుకో" మాట ఆపి కొంటెగా చూశారు ఆఫీసరుగారు.


"మీకెలా కృతజ్ఞత తెల్పుకోవాలో నాకు తెలియడం లేదు. నా జీవితానికి ఆధరువు దొరికింది" సంతోషాన్ని కంట్రోలు చేసుకోలేక గబగబా మాట్లాడింది లక్ష్మి. ఐదు నిమిషాలు మౌనంగా గడిచింది.


"నేనిక వస్తానండి" అంటూ లేచింది లక్ష్మి

## మొగలిరేకుల జడ ముగ్గు

మొదట మధ్యన 27 చుక్కలు వరుసగా పెట్టాలి. తరువాత ఇరువైపులా చుక్కలు పెడుతూ 14 చుక్కలదాకా పెట్టాలి. మొదటి చిత్రంలో చూపినట్లుగా కలిపితే ముగ్గు పూర్తవుతుంది. ఈ ముగ్గుకి రంగులు వేస్తే చూడముచ్చటగా వుంటుంది.

—జి. బ్రహ్మనాయకి, హైద్రాబాదు





ఆఫీసుగారి చూపులు తట్టుకోలేక. "వద్దు కూర్చో" అంటూ చొరవగా చేయి పట్టుకున్నారు. కూర్చో పెట్టారు ఆకులా వణికింది....భయంగా ఆయన కళ్ళలోకి చూసింది. ఆయన కళ్ళల్లో కోరిక మండుతోన్న కొరివిలాగా ఎర్రగా మెరుస్తోంది.

"క్షమించండి" అంటూ లేచి వెళ్ళబోయింది.

వెనుకగా నడుంచుట్టూ చేతులువేసి అదుము కున్నారు ఆయన.

"ఛీ వదులు" అంటూ తలుపు వైపు పరుగెత్తింది.

అంతకంటే ముందుగా తలుపువేసి డోర్ లాక్ చేసి ఇప్పుడేం చేస్తావ్ అన్నట్టుగా నవ్వారాయన.

పులిలా మీదపడ్డారు....లేడిపిల్లలా గింజుకొంది.

బలం ఉపయోగించి ఒక్క తోపు తోసింది. సోఫా మీద వెల్లికిలా పడ్డారు ప్రక్కన ఉన్న స్టూలు రెండు చేతులతో ఎత్తి పట్టుకొని తలమీద బాదింది ఒకటి....రెండు....మూడు అంతే చుట్టూ చూసి తీసి ఉన్న కిటికీలోంచి ఒక్క దూకు దూకి పారిపోయింది.

మరుసటి రోజు లాక్‌చేసిన తలుపు బద్దలుకొట్టి చూశారు....శవం!! పోలీసులు వచ్చారు. హతుణ్ణి కనుగొన్నారు. హంతకురాలి పేరు తెల్సుకొన్నారు. దర్యాప్తు ప్రారంభమైంది.

రెండవ రోజు....

ఆ బిల్డింగు ఆవరణలో....

పాడుబడ్డ నూతిలో....

తెల్లని చీర పైకి లేచింది....

పోలీసులు మళ్ళీ వచ్చారు. శవాన్ని గుర్తు పట్టారు.


ఆత్మహత్య అని నిర్ధారించారు.

కానీ.......

రెండు రోజుల క్రితం.......

శీల రక్షణ కోసం ఆఫీసరుగార్ని కొట్టి.... ఆ కంగారులో కిటికీలోంచి దూకి....పరుగెత్తుతూ... కనుచీకటిలో....గోడలు సరిగాలేని ఆ పాడుబడ్డ నూతిలో....పడిపోయిందని....ఎవరికి తెలుసు?

తరతరాలుగా నరనరానికీ జీర్ణించుకుపోయిన మగవారి అహంకారానికి ఎదురునిల్చి పోరాడి... గెలుపొందినా విధి వైపరీత్యం వల్ల మరణించిందన్న నగ్నసత్యం ఎవరికీ తెలియదు, అందరూ అనుకొంటున్నారు "శిక్షకు భయపడి ఆమె ఆత్మహత్య చేసుకొంది" అని. □




ఇళ్ళలో అలంకారంగా గోడలకు తగిలించుకొనేందుకు సాధారణంగా బజారులో కొన్న పటాలను వాడుతూ వుంటాము. అయితే సొంతంగా మనం తయారు చేసినవి అయితే ఖర్చు తక్కువగానూ, చూడటానికి ఎంతో అందంగానూ ఉంటాయి. మనం చేసుకున్నాము అనే సంతృప్తి కలుగుతుంది. ఫొటోలో కనిపిస్తున్న అమ్మాయి పటాన్ని తయారు చేయడం చాలా తేలిక. ఎంబ్రాయిడరీ చెయ్యడం ఏ మాత్రం తెలిసినవారైనా సులువుగా చేసుకొనవచ్చును.

కావలసిన వస్తువులు : పసుపురంగు (మామిడిపండు రంగు) పాప్లిన్ గుడ్డ 24"×16 ఈ క్రింది ఏంకర్ వారి దారాలు ఉపయోగిస్తే బావుంటుంది. ఎరుపురంగు (065); ముదురు పసుపు (0291); లేత ఆకుపచ్చ రంగు (0237); గోధుమరంగు (0360); ఆరంజి కలరు (0332); ఊదారంగు (0107).



ముందుగా పసుపురంగు గుడ్డపై కొంచెం పెద్ద' సైజులో అమ్మాయి బొమ్మను ట్రేస్ తీసుకోవాలి. ఈ విధంగా ట్రేస్ తీసుకున్న బొమ్మని క్రింది విధంగా ఎంబ్రాయిడరీ చేసుకోవాలి. అమ్మాయి ముఖం, భుజాలు, చేతులు అవుట్‌లైను ఆరంజి కలరుతో కాడ కుట్టు కుట్టాలి. గౌను ఔట్‌లైను, తలపై నున్న పూలు, చేతిలోను, గౌను బోర్డరు పైన ఉన్న పూలను ఎరుపు రంగుతో కాడ కుట్టు కుట్టుకోవాలి. అమ్మాయి చుట్టూ ఉన్న ఆర్చ్ గౌనులో నున్న చుక్కలు ఎరుపురంగు దారంతో ముడి కుట్టు కుట్టాలి. ఆర్చ్ ప్రక్కనున్న నిలువు గీతలు ముదురు పసుపుతో గొలుసు కుట్టు కుట్టాలి. గౌనుకు అటూ, ఇటూ ఉన్న గళ్ళు ఎరుపురంగుతో కాడ కుట్టు కుట్టాలి. ఇక గౌను మధ్యనున్న గీతలు గోధుమరంగు దారంతో గొలుసుకుట్టు, గౌనులో నున్న ముద్దకుట్టు ఊదా రంగు దారంతోనూ కుట్టాలి. పువ్వుల చుట్టూ ఉన్న ఆకులు లేత ఆకుపచ్చ రంగుతో ముద్ద కుట్టు కుట్టాలి. చివరిగా కళ్ళు ముక్కు, నోరు నలుపు దారంతో కాడ కుట్టుకుడితే బొమ్మ కుట్టడం పూర్తవుతుంది. ఇప్పుడు ఈ బొమ్మ కుట్టిన గుడ్డను బాగా ఉతికి, ఇస్త్రీచేసి ఫ్రేము కట్టిస్తే చాలా అందంగా ఉంటుంది.

—దండు విజయలక్ష్మి